# అనదిబాధ

## మధురాంతకం రాజారాం

మన యూనివర్సిటీల్లో ఎవరైనా 'ఆకలి'ని గురించి రీసెర్చి చేయాలనుకుంటే, వాళ్ళకు నేను సత్తిరాజు పేరు రికమెండ్ చేస్తాను. ఆకలి ఒక సముద్రం లాంటిదైతే దాని లోతుల్ని తాకినవాడు సత్తిరాజు. ఆకలి ఒక మేరువులాంటిదైతే దాని ఎత్తుల్ని కొలిచినవాడు సత్తిరాజు. ఆంధ్ర, కర్ణాటక బార్డర్లో అజ్ఞాత, విస్మృత గ్రామ సీమల్లో ఎక్కడో అతడి పుట్టుక. అన్నాన్ని పరబ్రహ్మమని అనుకోడం నేను విన్నాను. కానీ రాగిపిండి సంకటి, రాగిపిండి ఉప్మా, రాగిపిండి అంబలి, ఇలా సర్వమూ రాగులమయమే అయిన భోజనాన్ని పరబ్రహ్మ స్వరూపంగా భావించ వచ్చునా అని నా అనుమానం! అయితే సత్తిరాజుకు మాత్రం అలాంటి అనుమానం లేశమాత్రమున్నూ లేదు. తన చిన్ననాటి భోజన వైభవాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ అతడనేవాడు – 'గోడకు వేసి కొడితే రబ్బరు చెండు మాదిరిగా తిరిగొచ్చి చేతిలో పడాలయ్యా రంగనాథం! రాగ్గి పిండితో చేసిన సంకటి ముద్దంటే అది! దానికొక్కటే అనుపానం. ఎండుమిరప కాయల గొడ్డుకారం. ఆకొన్న కడుపుతో ఆకుముందు కూచుంటే అదే అమృతం. అట్లాగన్జెప్పి మేమెప్పుడూ వరిబియ్యపన్నాన్ని కళ్ళజూళ్ళేదనుకోవద్దు. ఏ పండగొచ్చినా, పబ్బమొచ్చినా మా ఆకులో సాక్షాత్తు తుమ్మిపువ్వుల కుప్ప మాదిరిగా కనిపించేది అదే గదా! కూడంటే గుండెకాయ, మెతుకంటే మేనమామ మాకు! పెద్దబాలశిక్ష అట్టపైన కొన్ని మందుల ప్రకటనలుండేవిలే! వాటిని బట్టి నా భోజన పదార్థాలకు నేను పేర్లు పెట్టుకున్నా! సంకటంటే ఏమిటో తెలుసునా? అది చ్యవనప్రాస లేహ్యం. మరి వరిబియ్యపన్నం సంగతడగవే! అవేగదటయ్యా మదనానంద గుళికలు!'

కరువు కాటకాల పురిటిగడ్డలో పుట్టి, కడుపెండగట్టుకుంటూ పెరిగిన సత్తిరాజు, ఉండివుండీ 'పెండోరాస్ బాక్స్' లాంటి తన జ్ఞాపకాల బోషాణాన్ని తెరిచేసేవాడు.

'ఏమయ్యా రంగనాథం! ఆకులలములు మేసి బ్రతకడమంటే ఏమో తెలుసునా?' అనేవాడు.

'అదెలాగయ్యా?' అనేవాణ్ణి.

'మా ఊరికవతల మల్లేశ్వరుడి కొండ. కొండ దాటితే కాటమరాజు కోన. చిక్కం భుజానికి తగిలించుకొని, తెల్లారుజామున్నే బయల్దేరితే – పొద్దు పదిబారలెక్కేటప్పటికి కోనలో వుండాల. మధ్యాన్నానికి ఆకుతో చిక్కం నింపుకోవాల! దేవదారాకంటే ఏమనుకున్నావో! అది మాకు వరప్రసాదం. ఎండకు వెయ్యి. ఉడకబెట్టు. ఉప్పురాళ్ళు వెయ్. ఇంత మిరప్పొడి చిలకరించు. ఉంటే గింటే కాసిన్ని వేరుశనగ్గింజలు నూరి ఆ పొడి అందులో కలుపుకో! పట్టెడాకు తిని, ఒక లోటా నీళ్ళు పట్టించేసినావంటే – ఇంకొక జాము సేపటిదాకా ఆకలి నీ దగ్గరికి రాదు.'

ఇదయిందా! వెంటనే ఇంకొకటి.

'చూడు రంగనాథం! కలమందగడ్డలు తినినావా ఎప్పుడైనా?'

'అవెక్కడ దొరుకుతాయి నాయనా?' అనేవాణ్ణి.

'మార్కెట్టులో దొరకవులే. మా మిడిశోపుల చుట్టూ ముండ్లపొదలుంటాయి. ఆ పొదల్లో బలిసిపోతూవుంటాయి. కలబంద మొక్కలు. వానాకాలం వచ్చేటప్పటికి మొక్కలోనుంచీ మోను పుడుతుంది. చూస్తూ చూస్తూ వుండగానే అది జండా కొయ్యమాదిరిగా పెరిగిపోతుంది. అప్పుడింక పెరిగిన



మోనును నరికి పారెయ్యాల! గునపంతో తవ్వి గడ్డలు పైకి తియ్యాల. కలమంద గడ్డంటే రంగనాథం, ఆకలి కడుపుకు అది కలకండ పెళ్ళేననుకో ....'

అణిమాద్యష్ట సిద్ధుల్ని గురించి, సిద్ధౌషధాలను గురించి నేను విన్నాను. ఆకలిని జయించడంలో అంతకు మించిన చిట్కాలను కనుగొన్న మానవుల్ని గురించిమాత్రం నాకు సత్తిరాజుమూలంగానే తెలిసొచ్చింది. చెత్తలో నుంచి సత్తు కలిగిన ఆహారాన్ని సృష్టించే ప్రాజెక్టు ఒకటి తలపెడితే దానిద్వారా వాళ్లు మిరకిల్స్ చేసి చూపించగలరని నేను విశ్వసించాను.

వాస్తుశాస్త్రంలో మయుణ్ణి చంపి పుట్టిన మహాశిల్పి ఒకాయన వుండేవాడు. ఆయన పేరు పెరుమాళ్ళ మేస్త్రీ. సదరు మేస్త్రీగారు నిర్మించిన మూడంతస్తుల మాయామందిరంలోని ఒక పావురాల గూడులో సత్తిరాజూ, నేనూ అన్యోన్యంగా అద్దెకుండేవాళ్ళం. చేతి పనుల ఎంపోరియంలో సేల్స్‌మన్‌గా సత్తిరాజు, నాలుగైదు కొట్టల్లో పద్దులురాసుకుంటూ నేనూ. తమ చేతిక్రింద పనిచేసే ఉద్యోగి జీవించే వుండాలన్న మహదాశయంతో ఎంపోరియం వాళ్ళిచ్చే నెలజీతం డెబ్భైఅయిదు రూపాయలు సత్తిరాజుకేమాత్రం సరిపోయేది కాదు. తలకు చుట్టుకోడానికైనా చాలని తుండుగుడ్డతో ఒళ్ళంతా దాచుకోవలసినట్టుండే పరిస్థితి. ప్రాణావసరమైన తిండికన్నా ముఖ్యంగా, మరికొన్ని బాదర బందీలు సృష్టించినందుకు మానవ నాగరికతను కసిదీరా తిట్టుకోవాలని ఉండేది సత్తిరాజుకు. ఆదిమ యుగాల్లో మానవుడు ఒక ఆటవిక జంతువుగా బ్రతికిన బంగారు కాలాన్ని గురించి తలపోస్తూ అతడు తన ఆక్రోశాన్ని వెలిబుచ్చేవాడు - 'చూడవయ్యా రంగనాథం! అప్పట్లో మానవుడు పచ్చి మాంసమే పీక్కు తిన్నాడో, కాయగసరులే కబళించినాడో మనకనవసరం! ఒకటి మట్టుకూ నిజం! అతడు అరగడుపుతో, వరగడుపుతోమాత్రం మాడిపోయి వుండడు. అదృష్టవంతుడు! వాడికి ఇంటి బాడుగ చెల్లించాల్సిన బెడద లేదు. హాయిగా ఆకులో, బెరళ్ళో మొలకు చుట్టుకునేవాడుగనుక బట్టలుకొనే తాపత్రయం అసలే లేదు. అవే లేకపోయినాక, ఇక చూలేమిటన్నట్టు ఇక లాండ్రీలను గురించి, సెలూన్లను గురించి వాడికి కాబట్టే వుండదు. నువ్వూ, నేనూ అలా బ్రతగ్గలమా? ఎంతటివాళ్ళకు దొరికేదయ్యా అంతటి భాగ్యం?'

ఉండి, వుండీ ఏ అర్ధరాత్రప్పుడెప్పుడో లేచి కూచునేవాడు సత్తిరాజు. భ్రూమధ్యంలో చూపు నిలిపిన యోగిసత్తముడిలా పైకప్పుకేసి చూస్తుండేవాడు. 'తెల్లవారడానికింకా చాలా టైం వుంది. పడుకోరాదా?' అంటే 'వ్చ్, లాభం లేదులే రంగనాథం! ఆకలిగా వుంది. ఈ రాత్రికింక జాగరణమే' అనేవాడు. 'బాబూ! సత్తిరాజూ! మనబోటి సామాన్యుల కడుపుల్లో ఇంతింతలావు జఠరాగ్ని వుండొచ్చునా? ప్రమాదం గదా!' అని మెత్తగానే మందలించేవాణ్ణి. సత్తిరాజు ముఖంలో ఆగ్రహం పరవళ్ళు ద్రొక్కేది. 'మరి ... రంగనాథం .... నాగ్గనుక .... దేవుడనేవాడు ప్రత్యక్షమైతేనా' హుంకరించినట్టుగా అనేవాడు. 'ఏంచేస్తావని' విస్తుపోతూ ప్రశ్నించేవాణ్ణి.

"ఈభూప్రపంచకంమీద గాడిదలనేవాటిని మాత్రం లేకుండా చేసెయ్యమని కోరుకుంటాను..."

'ఎందుకు నాయనా! ఎనభై నాలుగు లక్షల జీవరాసుల్లో వాటినిగూడా వుండిపోనీరాదా?' అంటూ ప్రాధేయపడేవాణ్ణి.

'ఉఁహూ, నీకు తెలియదులే రంగనాథం! ఈ అనర్థానికంతా అవే కారణం. నేను పురిటిబిడ్డగా వుండగా మా అమ్మ ఏం చేసిందో తెలుసా? వరుసగా మూడు రోజులు నాకు గాడిదపాలు తాగించింది. గాడిదపాలు తాగడమంటే ఏమనుకున్నావు? ఇక చచ్చేదాకా నీ కడుపులో జఠరాగ్ని నిద్రపోదన్నమాటే! అంతా నా కర్మ! అరణ్యాల్లో వుండగా పాండవులకదేదో దొరికిపోయిందట-అక్షయపాత్ర! నాకటువంటిది దొరకరాదా? బూందీ కావాలంటే బూందీ, జిలేబీ కావాలంటే జిలేబీ, గులాబ్‌జాం కావాలంటే గులాబ్‌జాం ....'

'చాల్లేవోయ్ సత్తిరాజూ! అత్యాశకైనా హద్దుండాలి. అదిగో, అకుండలో నీళ్ళున్నాయి గానీ, తాగేసి పడుకో,' అంటూ ముఖం నిండుకూ ముసుగు కప్పేసుకునేవాణ్ణి.

నీళ్ళు తాగి పడుకున్నా నిద్ర రాకపోవడం వల్ల, చాపపైన అటూ, యిటూ దొర్లుతూ వుండిపోయేవాడు సత్తిరాజు. సూర్యోదయంతోబాటు అతడికి జ్ఞానోదయంకూడాఅయ్యేది. 'రంగనాథం! రాత్రి గడ్డితినిందిలే! ఇప్పుడొచ్చింది. ఏంది? నా బుద్ధి. పాపం, గాడిదలెట్లాగైనా నోరులేని జీవాలు. దేవుడు కనిపిస్తే వాటిని నాశనం చెయ్యమని కోరుకోను.'

'మరేం కోరుకుంటావు?' కాస్త భయపడుతూనే అడిగేవాణ్ణి.

"పెద్ద కోరికేం కాదులే! మంచి మిలిటరీ హోటల్లో సర్వరుద్యోగం యిప్పించినా చాలు..."

తిండి తినడం, నిద్రపోవడం మొదలైనవి ప్రాణుల సహజ ధర్మాలు. ఆధునిక రాజ్యాంగాలు కర్మ సిద్ధాంతాన్ని ఖాతరు చెయ్యవు గనుక, మానవుడు కడుపునిండా తినాలనుకోడం చట్టరీత్యా నేరమేమీ కాదు. కానీ హక్కుండడంతో ఏమయింది? అవకాశం వుండాలిగదా! అనేవాణ్ణి నేను. అవకాశం తేరగా దొరుకుతుందా, దానికోసం వెదకాలి- అనేవాడు సత్తిరాజు.

అనడమేకాదు, అనతికాలంలో అతనొక అవకాశాన్ని పట్టుకొచ్చేశాడు. ఆలోచించిన కొద్దీ అదొక అమోఘమైన ఉపాయంగానే తోచింది. నీలో ఆకల్ని నువ్వు తీర్చుకోలేనప్పుడు, వాటిని తీర్చగల వ్యక్తి చేతికిగానీ, సంస్థ చేతికిగానీ నీ జీవితాన్ని తీసుకెళ్ళి అప్పగించడంలో తప్పులేదు. కాస్త రిస్కుతో గూడిన వ్యవహారమేగావచ్చునుగాక! అత్యవసర జీవితావసరాలు తీరిపోవడానికి ఢోకా లేనప్పుడు, ఆమాత్రం రిస్కు నిరామాటంగా తీసుకోవచ్చు. మరునాటి ఉదయం మేము రిక్రూటింగ్ ఆఫీసు ముందు తచ్చాడుతున్నాము. సాయంకాలానికల్లా లిస్టు వేశారు. లిస్టులో నా పేరుమాత్రం వుంది. సత్తిరాజు పేరులేదు.

'ఏంచెయ్యమంటావు రంగనాథం! దురదృష్ట దేవతకు నేను ముద్దుబిడ్డనైపోయినాను. చిన్నప్పుడెప్పుడో మల్లేశ్వరుడి కొండపైన కాలుజారి పడితిని. మోకాటికింద ఎముక విరిగింది. పుత్తూరికి తీసుకపోయి మూళ్ళాళ్ళు కట్టు కట్టించుకొచ్చినారు. నేను కాలు కొంచెం ఎగరేస్తూ నడవడం అందుకే! డాక్టరుగాడేమైనా గుడ్డోడా! ఎట్టనో పసిగట్టేసినాడు. కాలూ, చెయ్యీ సరిగ్గా లేనివాడు మిలిటరీకేం పనికొస్తాడు చెప్పు.'

ట్రెయినింగుకోసం నన్ను పూనా వెళ్ళమన్నారు. ఆరోజు నన్ను సాగనంపడంకోసం స్టేషనుకు వచ్చి ప్లాట్‌ఫారంపైన నిల్చున్న సత్తిరాజు యింకా నా కళ్ళల్లో మెదులుతున్నాడు. అతడి మాటలు నాచెవిలో గింగురుమంటూనే వున్నాయి. 'క్షేమంగా వెళ్ళిరావయ్యా రంగనాథం! నేనన్ని వివరాలూ విచారించి తెలుసుకున్నాలే! మిలిటరీ క్యాంపులో ఉదయం అయిదు గంటలయ్యేటప్పటికి 'ఏ వన్' కాఫీ ఇచ్చేస్తారట! మళ్ళీ ఎనిమిదింటికే టిఫిను. ఇడ్లీలకైతే సాంబారు. పూరీలకైతే ఉర్లగడ్డల మసాలా. నువ్వెన్నయినా తినొచ్చు. అడిగేవాళ్ళుండరు. మధ్యాహ్నం పన్నెండున్నరకు టంచనుగా భోజనం ఎట్లాగూ మిలిటరీలో చేరినావుగనక మిలిటరీ భోజనమే ఎన్నుకో! బిర్యానీ, చికెన్, ఆమ్లెట్...'

ఇంకా ఏమిటో చెబుతూనే వున్నాడు సత్తిరాజు, నేనెక్కినరైలుబండి కదిలింది. ●